# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 10-03-2026                సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- అరుదైన ఖనిజాల విషయంలో మిగిలిన రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలపై సమగ్ర అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు స్పష్టం చేశారు.
- భూ కేటాయింపులు సహా వివిధ ప్రతిపాదనలకు సీఆర్డీఏ 59వ సమావేశంలో ఈరోజు ఆమోదం లభించింది.
- వేసవి సంసిద్ధతపై సమీక్ష జరిపిన హోం మంత్రి వి. అనిత ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.
- విశాఖపట్టణాన్ని గ్లోబల్ హబ్ గా తీర్చిదిద్దుతున్నామని మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి తెలిపారు.

==================

గనుల శాఖపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు సమీక్ష నిర్వహించారు. 'ఆంధ్రప్రదేశ్ టైటానియం, స్ట్రాటజిక్ మెటీరియల్స్ మిషన్ (AP-TSMM)' రూపకల్పన, పెట్టుబడులు తదితర అంశాలపై అధికారులతో చర్చ సందర్భంగా... వచ్చే పదేళ్లలో ఈ మిషన్ ద్వారా 50 వేల కోట్ల రూపాయల పెట్టుబడులు, 40 వేల ఉద్యోగాలను కల్పించడమే లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. అరుదైన ఖనిజాల విషయంలో మిగిలిన రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలపై సమగ్ర అధ్యయనం చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలోని తీరప్రాంతంలో లభించే బీచ్ సాండ్ మినరల్స్ దేశంలోనే అత్యంత విలువైనవని, వీటిలో ఇల్మెనైట్, రుటైల్, జిర్కాన్, మోనాజైట్, గార్నెట్, సిల్లిమనైట్ వంటి ఖనిజాలు ఉన్నాయని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. రాష్ట్రంలో లభిస్తున్న ఖనిజాలను సమర్థవంతంగా వినియోగించుకునేందుకు మూడు ప్రాసెసింగ్ పార్కులను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలను అధికారులు ముఖ్యమంత్రి ముందుంచారు. అందులో ఒకటి శ్రీకాకుళంలో టైటానియం పార్క్ కాగా.. రెండవది అనకాపల్లిలో రేర్ ఎర్త్ కారిడార్, మూడవది మచిలీపట్నంలో సమగ్ర టైటానియం రేర్ ఎర్త్ కారిడార్. ఈ సమీక్షకు మంత్రి కొల్లు రవీంద్రతో పాటూ ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

=================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్డీఏ) 59వ సమావేశం ఈరోజు అమరావతిలో జరిగింది. భూ కేటాయింపులు సహా వివిధ ప్రతిపాదనలకు సీఆర్డీఏ ఆమోదం తెలిపింది. అందులో ముఖ్యంగా సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సిబిఎస్ఈ) కార్యాలయ నిర్మాణానికి 80 సెంట్ల భూమి కేటాయించడానికి పరిహారంగా తుళ్లూరు ఎడ్యుకేషనల్ సొసైటీకి 3 ఎకరాలు ఇచ్చేందుకు ఆమోదించింది. రాష్ట్ర సచివాలయం, హెచ్ఓడీ టవర్ల నిర్మాణంలో మెకానికల్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ పనుల కోసం 2 వేల 316 కోట్ల రూపాయల పరిపాలనా అనుమతులకు సీఆర్డీఏ అంగీకారం తెలిపింది. పంచాయితీరాజ్ విభాగంలోని ఏపీఎస్ఐఆర్డీకి 5 ఎకరాల కేటాయింపులతో పాటూ.. 119 కోట్ల రూపాయల వ్యయంతో తెలుగు కల్చరల్ సెంటర్ నిర్మాణానికి సీఆర్డీఏ ఆమోదం తెలిపింది.

=================

రాష్ట్రంలో పెరుగుతున్న ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఎటువంటి ప్రాణ, పశు నష్టం జరగకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని హోం, విపత్తు నిర్వహణ శాఖల మంత్రి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని కార్యాలయంలో కలెక్టర్లు, లైన్ డిపార్ట్ మెంట్స్, విపత్తు నిర్వహణ సంస్థ అధికారులతో ఎండ తీవ్రత, వడగాల్పుల సంసిద్ధతపై మంత్రి అనిత ఈరోజు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 'హీట్ వేవ్ యాక్షన్ ప్లాన్ -2026'ను ఆవిష్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ... రాష్ట్రంలో పెరుగుతున్న ఎండ తీవ్రత, వడగాల్పుల దృష్ట్యా ప్రజల ప్రాణ రక్షణే ప్రథమ కర్తవ్యంగా అధికారులు పని చేయాలని స్పష్టం చేశారు. హీట్ వేవ్ మరణాలు లేకుండా శాఖల వారీగా కార్యాచరణ అమలు చేయాలని ఆదేశించారు. విపత్తు నిర్వహణ సంస్థ (RTGS) నుండి అందే వడగాల్పుల హెచ్చరికలను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేస్తూ.. వారిని అప్రమత్తం చేయాలని కలెక్టర్లకు మంత్రి సూచించారు.

=================

అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వం సంక్షేమాన్ని చేరవేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అన్నారు. ఈరోజు ఆయన మంగళగిరిలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలుపై మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ... సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమానంగా ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీల్లో 90 శాతం అమలు చేశామన్నారు. విశాఖపట్టణాన్ని గ్లోబల్ హబ్ గా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. రాష్ట్రాన్ని మొత్తం మూడు ఎకనామిక్ జోన్లుగా అభివృద్ధి చేస్తున్నామని.. అందులో భాగంగా విశాఖ, అమరావతి, తిరుపతి జోన్లకు సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని మంత్రి వీరాంజనేయస్వామి తెలియజేస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

విరామం

=================

పోలవరం ప్రాజెక్ట్ ను గోదావరి పుష్కరాలకు ముందే పూర్తి చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు చెప్పారు. ఆయన ఈరోజు ప్రాజెక్టు పనుల పురోగతిని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా.. ఇంజనీరింగ్ నిపుణులు, ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడారు. పోలవరం పూర్తి చేయడం ద్వారా ఇటు ఉత్తరాంధ్రతో పాటూ.. అటు రాయలసీమకు గోదావరి జలాలు అందించి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయబోతున్నామని చెప్పారు. రాష్ట్రంలోని మిగిలిన ప్రాజెక్టులను కూడా ఒక క్రమపద్ధతిలో పూర్తి చేసేలా కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. ప్రాజెక్టు నిర్మాణాలకు సంబంధించి అత్యున్నత ప్రమాణాలు పాటిస్తున్నామని మంత్రి రామానాయుడు వివరిస్తూ...

(వాయిస్ 29 సెకన్లు)

=================

రైతులకు అవసరమైన యూరియా ఎరువుల సరఫరాను ప్రభుత్వం సమర్థవంతంగా నిర్వహిస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. 2025 ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన 8.70 లక్షల మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంచామని, వీటిలో 7.50 లక్షల మెట్రిక్ టన్నుల అమ్మకాలు జరిగాయని, సుమారు లక్ష మెట్రిక్ టన్నుల నిల్వతో ఖరీఫ్ సీజన్‌ను విజయవంతంగా పూర్తి చేశామని తెలిపారు. 2025–26 రబీ సీజన్‌కు కేంద్ర ప్రభుత్వం 9.38 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించిందని చెప్పారు. ఫలితంగా ఇప్పటివరకు 10.20 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను రాష్ట్రంలో అందుబాటులో ఉంచి ఫిబ్రవరి నెలాఖరుకే రైతుల అవసరాలను పూర్తిగా తీర్చామని తెలిపారు. అదే విధంగా ఎరువుల బఫర్ స్టాక్ నిర్వహణకు ప్రతి సంవత్సరం కేటాయించే 40 కోట్ల రూపాయలకు అదనంగా మరో 45 కోట్ల రూపాయలు కేటాయించామని మంత్రి వెల్లడించారు.

=================

పార్వతీపురం మన్యం జిల్లాలోని పలు హోటళ్లలో డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను అక్రమంగా వినియోగిస్తున్నారన్న సమాచారం మేరకు పౌరసరఫరాల శాఖ అధికారులు ఈరోజు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లా సంయుక్త కలెక్టర్ సి. యశ్వంత్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన తనిఖీల్లో మొత్తం 24 గృహావసర ఎల్పీజీ సిలిండర్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా సరఫరా అధికారి తెలిపిన వివరాల ప్రకారం.. గృహావసరాల కోసం ప్రభుత్వం రాయితీపై ఇచ్చే సిలిండర్లను కొందరు హోటల్ యజమానులు వాణిజ్య అవసరాలకు మళ్లిస్తున్నట్లు సమాచారం అందడంతో స్థానిక హోటళ్లలో తనిఖీలు చేపట్టామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా సరఫరా అధికారి మాట్లాడుతూ... రాయితీ సిలిండర్లను వాణిజ్యపరంగా వాడటం చట్టరీత్యా నేరమని.. అర్హులైన పేదలకు, గృహ అవసరాలకు అందాల్సిన గ్యాస్‌ను అక్రమంగా మళ్లిస్తే సదరు హోటల్ యజమానులపై నిత్యావసర వస్తువుల చట్టం 6-A కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

=================

బాల్య వివాహాల నిర్మూలనకు కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ చేపట్టిన 100 రోజుల విస్తృత అవగాహన కార్యక్రమంలో భాగంగా `బాల్ వివాహ ముక్తి రథం` అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా ప్రయాణించి మాడుగుల పట్టణంలో తన యాత్రను ఈరోజు విజయవంతంగా ముగించింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సొసైటీ ఫర్ ఎడ్యుకేషన్ అండ్ ఎన్విరాన్మెంటల్ డెవలప్మెంట్ (ఎస్ఈడీ) డైరెక్టర్ వి.సన్యాసి రాజు మాట్లాడుతూ.. ఈ 100 రోజుల అవగాహన కార్యక్రమాన్ని ఒక ఉద్యమంగా అభివర్ణించారు. బాల్య వివాహాలను ప్రోత్సహించడం శిక్షార్హమైన నేరమన్నారు.

=================
=================